# కుల మతాల సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా

- ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్

మహేశ్వరం, అక్టోబర్ 10: కుల మతాల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ఎజెండా అని ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్ తెలిపారు. మంగళవారం మహేశ్వరం పంచాయతీ కార్యాలయం వద్ద బతుకమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచులకు సీఎం కేసీఆర్ పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్గాల ప్రజలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులే ఆమె గెలుపునకు నాంది పలుకుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ దోమ శ్రీనివాస్‌రెడ్డి వార్డు సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్ తదితరులు

## బతుకమ్మ చీరల పంపిణీ

ఆర్కేపురం/పహాడీషరీఫ్, అక్టోబర్ 10: కులమతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని కౌన్సిలర్ హసన్ షా తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని రేషన్ షాపులో ప్రభుత్వం అందజేసే బతుకమ్మ చీరలను 150 మంది మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమంతో పాటు మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మైనార్టీ కాలనీ, బస్తీల్లో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు.

## కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాలి



కందుకూరులో జరిగిన నాటక ప్రదర్శనలో పాత్రదారులను సన్మానిస్తున్న జడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు, అక్టోబర్ 10 : కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. రాచులూరు, తిమ్మాపూరు గ్రామస్తులు మండల కేంద్రంలో టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శ్రీకృష్ణరాయబారం పద్య నాటకం నిర్వహించారు. దుర్యోధనుడి పాత్రదారుడు తిమ్మాపూరు మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పున్న భిక్షపతితో పాటు పలువురు పాత్రదారులను జడ్పీటీసీ జంగారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని.. గ్రామస్తులు ముందుకొచ్చి వీధి నాటకాలు ప్రదర్శించడం సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, వెంకటేశ్‌గౌడ్, ఆనేగౌని అంజయ్య గౌడ్, యూత్ అధ్యక్షుడు కొలను విఘ్నేశ్వర్‌రెడ్డి, రాచులూరు, బేగంపేట్, కొత్తగూడ సర్పంచ్‌లు శ్రీనివాసచారి, గోవర్ధన్. సాధ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పర్వతాలు యాదవ్, అర్జునుడి పాత్రదారి రాచులూరు ఎంపీటీసీ బాల్‌రాజ్, గూడూరు ఎంపీటీసీ ఎల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఆనేగౌని అశోక్‌గౌడ్, అంజయ్య, గొర్రెంకల యాదయ్య, ప్రభాకర్, వివిధ గ్రామాల ప్రేక్షకులు పాల్గొన్నారు.

## నలుగురి బైండోవర్

యాచారం, అక్టోబర్10: మండలంలో గుడుంబా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మండలంలోని భాను తండాకు చెందిన జర్పుల పరంగి, రమావత్ విజయ, నక్కగుట్టతండాకు చెందిన విస్లావత్ సుక్యానాయక్, చింతపట్లకు చెందిన మాదరగోని రాములును ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రేమలత నలుగురిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా ఊరుకునేదిలేదని కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## వాహనాల తనిఖీలు

మహేశ్వరం, అక్టోబర్ 10: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మహేశ్వరం సీఐ ముని ఆధ్వర్యంలో మహేశ్వరం చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఐ ముని తెలిపారు. ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని అన్నారు. నగదు, బంగారు ఆభరణాలు కలిగి ఉండి ఎటువంటి ఆధారాలు లేకుంటే వాటిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, నర్సయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



మహేశ్వరంలో వాహనాల తనిఖీలను నిర్వహించిన సీఐ ముని

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



రమావత్ నాన్కి (ఫైల్)

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10 : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను సాగర్ రహదారిపై టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటర్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న మాడ్గుల మండలం దుబ్బగడ్డ గ్రామానికి చెందిన రమావత్ నాన్కి(40) అనే మహిళ కిందపడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఏరియా దవాఖానకు తరలించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు హుస్సేన్

## బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

ఆర్కేపురం/పహాడీషరీఫ్, అక్టోబర్ 10: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు హుస్సేన్ తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి వాది హుదాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతతత్వ పార్టీ బీజేపీతో ముప్పు పొంచి ఉందని.. కాంగ్రెస్ పార్టీ మాటలు చెప్పుడే తప్పా అభివృద్ధి చేయడం శూన్యమన్నారు. వీరు అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి నెట్టబడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్‌కు ప్రజల కష్టసుఖాలు తెలుసని.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనుకబడి ఉందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక కృషితో సీఎం కేసీఆర్‌తో మాట్లాడి కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చి మౌలిక వసతులు సమకూరుస్తున్నారని తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో వందల కోట్ల రూపాయల వ్యయంతో డ్రైనేజీ, సీసీ రోడ్లు, బాక్స్‌డ్రైన్ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. మిషన్ భగీరథ రిజర్వాయర్లు కట్టించి ప్రతి కాలనీకి, బస్తీకి పైపులైన్ ఏర్పాటు చేయించి ఇంటింటికి శుద్ధి చేసిన నీటిన సరఫరా చేయిస్తున్నారన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న జల్‌పల్లి కమాన్‌రోడ్డుకు ఇటీవలే రూ.2కోట్లు నిధులు కేటాయించి శాశ్వత సమస్యలను పరిష్కరించారన్నారు. డ్రీమ్‌సిటీ, గ్రీన్ సిటీ, నబిల్ కాలనీల్లో ఉన్న మురుగు సమస్యకు బాక్స్ డ్రైన్ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపెట్టారన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ కాలనీలు, బస్తీల్లో తిరిగి సమస్యలను తెలుసుకుని నిధులు కేటాయించి పరిష్కరిస్తున్నారన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డికి అండగా ఉండి కారు గుర్తుకు ఓటు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజాపాషా, సయ్యద్ అల్తాబ్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సమాయత్తం అవ్వాలి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 10 : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వినూత్న తరహాలో ప్రచారాన్ని ప్రారంభించారు. సెంటిమెంట్‌గా మంగళవారం డ పార్టీ ముఖ్య నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒకేసారి 365 మంది ముఖ్యమైన సమన్వయ కమిటీ నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కదన రంగంలోకి దూకాలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నా రు. గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అతి ముఖ్యమైన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇతర పార్టీలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశామని, ఈ కమిటీలన్నీ గ్రామ స్థాయిలో మండల కమిటీలు మండల స్థాయిలో సమష్టిగా పనిచేయాలన్నారు.

**నేడు సమన్వయ కమిటీ సమావేశం**

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బొంగుళూరు సమీపంలోని ఓ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని, దీనికి సమన్వయ కమిటీ సభ్యులందరూ విధిగా హాజరై పార్టీలో అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు, సలహాలు చేయాలని ఆయన సూచించారు.

### ఎమ్మెల్యే ఫోన్ చేసే వరకు తెలియదు

టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నేరుగా ఫోన్ చేశారు. ఫోన్‌చేసే వరకు ఎమ్మెల్యే నుంచి కాల్ వస్తుందని తెలియదు. ఫోన్‌చేసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం పని చేసి గెలుపు కోసం కృషి చేస్తా. పథకాలను ప్రజలకు వివరిస్తా.

– రవీందర్, బీఆర్ఎస్ నాయకులు, యాచారం

## హరిత దారులు..

మహేశ్వరం, అక్టోబర్ 10: మహేశ్వరం నియోజకవర్గంలో రహదారులు పచ్చని తోరణాలతో చూపరులను కనువిందు చేస్తున్నాయి. పలు రహదారుల పక్కన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మహేశ్వరం మండల కేంద్రం నుంచి మహేశ్వరం గేట్ వరకు వెళ్లే రహదారిలో పచ్చని చెట్ల తోరణాలు ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి.



మహేశ్వరం నుంచి మహేశ్వరం గేట్ వరకు వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన హరితహారంలో నాటిన మొక్కలు